క్లుప్తంగా

మెగా ఆరోగ్యశ్రీ గురించి ప్రజలకు తెలపండి..



మెగా ఆరోగ్యశ్రీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని తిలకిస్తున్న ఎంపీడీవో, అధికారులు

కోటవురట్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన మెగా ఆరోగ్యశ్రీ కార్యక్రమాన్ని అధికారులు ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా వీక్షించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు మెగా ఆరోగ్యశ్రీపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా సీఎం జగన్ ప్రారంభించిన మెగా ఆరోగ్యశ్రీని వీక్షించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో కంటే మెరుగైన వైద్య సేవలు అందుతాయని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

అయ్యప్ప ఆలయంలో ముగిసిన భిక్ష



నిర్వాహకులను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : స్థానిక అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమం సోమవారంతో ముగిసింది. అక్టోబర్ 25న ప్రారంభమైన భిక్ష 55 రోజుల పాటు నిర్విరామంగా సాగింది. ఇందుకు సహకరించిన దాతలకు ఆలయ కమిటీ చైర్మన్ వేగి లక్ష్మణరావు, కార్యదర్శి సత్యనారాయణలు కృతజ్ఞతలు తెలిపారు. భిక్ష ఏర్పాటులో భాగస్వాములైన నిర్వాహకులు దాడి పోలీసు, జల్లేపల్లి కృష్ణారావును సత్కరించారు.

జగనన్నతోనే యాదవులకు మేలు



ధూళి అప్పారావు

రాంబిల్లి: జగనన్నతోనే యాదవులకు మేలు సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మండల యాదవ నాయకుడు ధూళి అప్పారావు(బుజ్జి) అన్నారు. టీడీపీ నాయకుడు లోకేష్ పాదయాత్ర సందర్భంగా యాదవులతో సమావేశం నిర్వహించి తమ హయాంలోనే యాదవులకు మేలు జరిగిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. యాదవులకు పలు రకాల పదవులు ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ముఖ్యంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో కూడా పలు కీలక పదవుల్లో యాదవులున్న వాస్తవాన్ని టీడీపీ నాయకులు గుర్తించాలన్నారు.

అయ్యప్ప భక్తుల దీక్షల విరమణ



మునగపాక అయ్యప్పస్వామి ఆలయంలో ఇరుముడులతో మెట్లు ఎక్కుతున్న భక్తులు

మునగపాక: మునగపాక అయ్యప్పస్వామి ఆలయంలో ఇరుముడులతో భక్తులు 18 మెట్లు ఎక్కి మాలలు విసర్జించారు. సీజన్‌లో మాలలు ధరించిన భక్తులు సుదూర ప్రాంతాలకు వెళ్లలేని వారు సోమవారం మునగపాకలోని లింగరాయి గుడి వద్ద ఇరుముడులు ధరించారు. అక్కడ నుంచి కాలినడకన అయ్యప్ప నామస్మరణతో మెట్లు ఎక్కి మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయంలోని పురోహితులకు స్వయం పాకాలు అందజేసి స్వామివారిని దర్శించుకున్నారు.

తూర్పు కాపు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి

ఎస్.రాయవరం : అర్హులైన వారందరికీ తూర్పు కాపు ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని అనకాపల్లి జిల్లా తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు కరణం శ్రీహరి అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. చదువు కోసం విద్యార్థులు ధ్రువ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకుంటే సకాలంలో స్పందించడం లేదన్నారు. ఇకనైనా అర్హులుగా కాపులుగా పిలువబడే వారందకీ బీసీ (డి), ఓబీసీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలన్నారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ విచారణ చేయడంలో జాప్యం జరగవచ్చని ఇకపై వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆదుకుంటున్న 'ఉపాధి'





గత నాలుగున్నరేళ్లలో ఉపాధి పనుల వివరాలు

- మొత్తం చెల్లింపులు: రూ 38.56 కోట్లు
- పనులు: 25159
- జాబ్ కార్డులు: 10269
- కూలీలకు చెల్లించిన సొమ్ము: రూ.35 కోట్లు
- పథకం అమలు జరిగిన పంచాయతీలు: 30
- కూలీలు: 14449
- మెటీరియల్ రూపంలో చెల్లించిన సొమ్ము: రూ 3.56 కోట్లు
- 100 రోజులు పూర్తి చేసుకున్న కూలీలు: 3094

రాంబిల్లి : ఉపాధి హామీ పథకం కూలీలకు వరంలా మారింది. గతంలో గ్రామాల్లో ఉపాధి దొరక్క కూలీలు వలస వెళ్లిపోయే పరిస్థితి ఉండేది. నేడు ఉపాధి పథకంలో ప్రభుత్వం 100 రోజులు ఉపాధి పనులు కల్పించి స్థానికంగానే పని చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో గ్రామాల్లోనే పనులు చేసుకొంటూ కూలీలు జీవనం సాగిస్తున్నారు. రాంబిల్లి మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ పనులు లేని రోజుల్లో పనుల కోసం కూలీలు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. అయితే ఉపాధి పథకంతో ఆయా ఇబ్బందులు తప్పాయి. సాగునీటి కాలువల్లో పూడికతీత, నదుల గట్లు పటిష్టం వంటి పనులతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఉపాధి హామీ పథకంలో సగటున ఒక్కో కూలీకి ప్రభుత్వం 60 రోజులు పని కల్పించారు. ఒక్కో కూలీకి రూ. 268 చెల్లించారు. అర్హులందరికీ జాబ్‌కార్డులు ప్రభుత్వం అందిస్తోంది. దీంతో గ్రామాల్లో రైతులు, కూలీలు వారి సొంత వ్యవసాయ పనులేగాక , ఆవులు, గేదెలు పశుపోషణ చూసుకుంటూ ఉపాధి పనులకు వెళ్లి లబ్ధి పొందుతున్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు



దిమిలిలో ఉపాధి పథకంలో పని చేస్తున్న కూలీలు

100 రోజులు పనులు సద్వినియోగం



ఉపాధి పథకంలో 100 రోజుల పాటు పని వెళ్లి లబ్ధి పొందాను. మా కుటుంబం ప్రభుత్వం గరిష్ఠంగా పెట్టిన 100 రోజులు లక్ష్యంను పూర్తి చేసుకోవడం జరిగింది. ఈ పథకం పేద, మధ్య తరగతి ప్రజలకు వరం లాంటిది.

–పి. అప్పలనర్స, ఉపాధి కూలీ, దిమిలి

ఉపాధి పథకం ఆదుకుంటుంది



ఉపాధిహామీ పథకం ఎంతో ఆదుకుంటుంది. మా గ్రామంలోనే ఉపాధి పథకం పనులకు ఉపయోగించుకుంటూ జీవనం సాగిస్తున్నాం. ఇప్పటి వరకు 97 రోజులు పనులు పూర్తి చేశాను. పనులకు ఇతర ప్రాంతాలకు వలస పోకుండా ఉపాధి పథకం భరోసానిస్తుంది.

–ఎం. లక్ష్మి, ఉపాధి కూలీ, కట్టుబోలు

రూ 38.56 కోట్లు చెల్లింపులు



ఉపాధి హామీ పథకం ద్వారా గడిచిన నాలుగున్నరేళ్లలో కూలీలకు రూ.35 కోట్లు చెల్లించడం జరిగింది. మెటీరియల్ కింద రూ 3.56 కోట్లుతో కలిపి మొత్తం రూ 38.56 కోట్లు చెల్లించడం జరిగింది. గ్రామీణ ప్రజలకు ఈ పథకం ద్వారా ఎంతో మేలు జరుగుతుంది. మండల ప్రజలు ఈ పథకాన్ని బాగా వినియోగించుకుంటున్నారు

–కె.ఎస్. కొండలరావు, ఎంపీడీవో, రాంబిల్లి మండలం

సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యం



కొడవటిపూడిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు

కోటవురట్ల : సంక్షేమం ద్వారా అభివృద్ధిని అందిస్తున్నందుకే ఏపీకి జగనే సీఎం కావాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు అన్నారు. కొడవటిపూడిలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సచివాలయం వద్ద సంక్షేమ ఫ్లెక్సీ, మా నమ్మకం నువ్వే జగన్ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. సంక్షేమాన్ని అందిస్తూనే అభివృద్ధి ఏ విధంగా చేశారో వివరించారు. మళ్లీ సీఎంగా జగన్‌నే ఎన్నుకుంటే ఇంతకంటే మెరుగైన పాలన అందుతుందన్నారు. ప్రతిపక్షాల మోసపూరిత హామీలను నమ్మి మోసపోవద్దని, ఇచ్చిన అన్ని హామీలను దళారుల ప్రమేయం లేకుండా నెరవేర్చిన ఏకైక సీఎం జగన్ అన్నారు. నాడు–నేడు ద్వారా పిల్లలకు బంగారు భవితను ఇస్తున్నారన్నారు. మిచాంగ్ లాంటి తుపాను ధాటికి రైతులు తీవ్రంగా నష్టపోయినా ప్రతి రైతుకు నష్టపరిహారాన్ని అందేలా ముఖ్యమంత్రి జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోసూరు అప్పారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కుమారరాజా, పార్టీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, రొంగల వెంకటరమణ, రాజీవ్, ఈవోపీఆర్డీ భానోజీరావు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్యాబ్‌లు, ట్రైసైకిళ్లు పంపిణీ



నక్కపల్లిలో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, ఎంఈవోలు

నక్కపల్లి : ప్రతి ఒక్కరూ దివ్యాంగుల పట్ల మానవతా దృక్పథాన్ని కలిగి ఉండాలని ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నక్కపల్లి భవిత కేంద్రంలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగులకు ప్రభుత్వం సమకూర్చిన ట్యాబులు, ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 3వ తేదీన జరగాల్సిన ఈ కార్యక్రమం మిచౌంగ్ తుఫాను కారణంగా వాయిదా వేసి, సోమవారం ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంఈవో కుంచం నరేష్ మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మన్యూనతా భావాన్ని పక్కన పెట్టి ఆత్మ స్థయిర్యంతో ముందడుగు వేస్తే సాధించలేనిది ఏమీలేదన్నారు. అనంతరం వివిధ పాఠశాలల నుంచి వచ్చిన దివ్యాంగ విద్యార్థులకు ముఖ్య అతిథులు చేతుల మీదుగా ట్యాబులు, ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు పాటల పోటీలను నిర్వహించి ఆకర్షణీయమైన ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ విస్తరణాధికారి సత్యనారాయణ, హైస్కూలు హెచ్‌ఎం రాణి లలిత, ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్ ఆచార్యులు, స్పెషల్ ఎడ్యుకేటర్ షేక్ యాస్మిన్ భవిత కేంద్రం ఉపాధ్యాయులు అరుణ, గౌరి పాల్గొన్నారు.


సీఎం జన్మదినం సందర్భంగా క్రీడోత్సవాలు



క్రీడోత్సవాలు ప్రారంభిస్తున్న గూటూరు శ్రీనివాసరావు

పాయకరావుపేట : ఈ నెల 21న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకుని పట్టణంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్రీడోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే ఈ క్రీడోత్సవాల్లో వాలీబాల్, కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటున్నారు. నియోజకవర్గంలో గల 4 మండలాల నుంచి 20 టీమ్‌లు ఈ క్రీడల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల పెన్నిధి, సంక్షేమ పథకాల ప్రదాత, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడల్లో విజేతలైన వారికి ముఖ్యమంత్రి జన్మదినం నాడు నగదు బహుమతి అందించడం జరుగుతుందన్నారు. ఆ రోజున పేదలకు వస్త్రదానం, రక్తదాన శిబిరాలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఆయన క్రీడలు ప్రారంభించారు. జెడ్పీటీసీ సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పార్టీ నాయకుడు సూర్యచక్రం, మండల కో ఆప్షన్ సభ్యుడు రామకృష్ణ, అన్నవరం దేవస్థానం డైరెక్టర్ సుందరరావు, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, పాల్తేరు సర్పంచ్ గోసల కృష్ణ, సత్తిబాబు, స్టీల్‌ప్లాంట్ డాక్టర్ తాడి ప్రకాష్ రత్నం పాల్గొన్నారు.

ఓం స్కందాయ నమ..!



భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు



వెదురువాడలో సుబ్రమణ్యస్వామి వారికి పూజలు

యలమంచిలి రూరల్ : యలమంచిలి పట్టణంలో పాతవీధి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి పూజలు నిర్వహించారు. రాత్రి స్వామివారి ఉత్సవ మూర్తి ఊరేగింపు, , కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. నాగేంద్రకాలనీలో వున్న ఆలయాన్ని కూడా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. సర్పదోష నివారణార్థం ఇక్కడ పూజలు చేశారు.

అచ్యుతాపురం : వెదురువాడలో శ్రీ సుబ్రమణ్య స్వామి షష్ఠి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి.తెల్లవారు జాము నుంచి ప్రజలు స్వామి వారిని దర్శించుకొని అభిషేకాలు చేసుకున్నారు. స్వామి వారి కల్యాణంలో భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు.

ఇంధన పొదుపుపై బుర్రకథ

అచ్యుతాపురం(అనకాపల్లి): జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం అచ్యుతాపురం కూడలిలో నిర్వహించిన బుర్రకథ ఆకట్టుకుంది. కళాజాతర బృందం ప్రదర్శించిన ఈ బుర్రకథను ఏపీఈపీడీసీఎల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 14 నుంచి 20 వరకూ నిర్వహిస్తున్న ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ప్రజల్లో విద్యుత్ ఆదాపై అవగాహన కల్పిస్తున్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



వైఎస్సార్ బీమాలో భాగంగా రూ.10వేలు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : వైఎస్సార్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. మునగపాక బీసీ కాలనీలో అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల శరగడం రాము మృతి చెందారు. దీంతో రాము కుటుంబ సభ్యులకు సోమవారం వైఎస్సార్ బీమాలో భాగంగా తొలి సాయంగా రూ.10వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ద్వారా సాయం అందుతుందన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడా రి అచ్చియ్యనాయుడు, ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి కోనపల్లి రామ్మోహనరావు, పార్టీ మండల అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ భాస్కరరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కాల్షియంతో కూడిన ఆహారం తీసుకోవాలి



విద్యార్థులకు ఫ్లోరోసిస్ పరీక్షలు చేస్తున్న డాక్టర్ విశ్వనాథం

మునగపాక : విటమిన్–సి కాల్షియం ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా ఫ్లోరోసిస్ సోకకుండా నివారించవచ్చని డాక్టర్ విశ్వనాథం అన్నారు. ఎంపీపీ స్కూల్లో సోమవారం పిల్లలకు ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పించారు. ఫ్లోరోసిస్ వ్యాధి వల్ల దంతాలు, ఎముకలు దెబ్బతింటాయన్నారు. కాల్షియం అధికంగా ఉండే పాలు, గుడ్లు, రాగిజావ వంటి పదార్థాలు నిత్యం ఆహారంలో ఉండేలా చూడాలన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు ఉమామహేష్, పీహెచ్ఎన్ అనురాధ, ఎంఎల్‌హెచ్‌పీలు సంతోషి, ఉమా చంద్రిక, ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, దేవకి, రేవతి పాల్గొన్నారు.

పూడిమడకలో అనధికార లేఅవుట్‌పై ఫిర్యాదు

అచ్యుతాపురం: పూడిమడకలో వేస్తున్న అనధికార లేఅవుట్‌పై చర్యలు తీసుకోవాలని మత్స్యకార సంఘం నాయకులు సీహెచ్ అప్పారావు సోమవారం తహసీల్దార్ శ్రీనివాసరావును కోరారు. అక్టోబర్ 30వ తేదీన జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినప్పటికీ అనధికార లేఅవుట్ కార్యకలాపాలు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని ఆరోపిస్తూ వినతి పత్రం అందజేశారు.

ఏఎంబీ చర్చిలో ఘనంగా మహిళా క్రిస్మస్ వేడుకలు



మహిళా క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న రాయి సమత రమేష్ బాబు

పాయకరావుపేట : అరట్లకోట ఏఎంబీ చర్చిలో సోమవారం మహిళా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి బిషప్ డాక్టర్ కటికతల సుధాకర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సమత హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ ప్రొప్రయటర్ రాయి సమత రమేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘంలోని మహిళా విశ్వాసులకు సమత దేవుని వాక్య సందేశాన్ని అందజేశారు. క్రైస్తవ సంఘం, సమాజంలో మహిళలు పోషించాల్సిన పాత్రను గూర్చి వివరించారు. ఈ సందర్భంగా సంఘంలోని మహిళలు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళలు క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. సంఘ సభ్యులందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.

స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం లక్ష్యం



సంక్షేమం, అభివృద్ధి డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, చిక్కాల రామారావు



గంగాదేవిపేటలో ప్రచారం చేస్తున్న మూలపేట ఉప సర్పంచ్ దేవీచంద్ర

పాయకరావుపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. మండలంలో గల పీఎల్ పురం గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. అనే కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పడాల సోమన్నదొర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో స్వయంగా ప్రజల కష్టాలను తెలుసుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలన్నింటినీ నేరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత కూడా జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రతి గ్రామంలోను తాగునీరు సరఫరా, నాడు నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి ప్రతి గ్రామంలోను జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరలా జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సంక్షేమం, అభివృద్ధి కూడా రెండు కళ్లలా పాలన సాగిస్తున్నారన్నారు. మహిళల అభివృద్ధే లక్ష్యంగా స్వయంగా మహిళల ఖాతాలకే సంక్షేమ పథకాలు నగదును జమ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం గ్రామానికి సంక్షేమం, అభివృద్ధికి విడుదలైన రూ.17 కోట్లు వివరాలతో డిస్‌ప్లే బోర్డును ప్రారంభించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జిల్లా ప్రచారం విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ చోడిపల్లి శ్రీను, పార్టీ మహిళ మండలి అధ్యక్షురాలు బొడ్డా శ్రీదేవి పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజారంజక పాలన

మునగపాక: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రజారంజక పాలన అందుతుందని మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శ్రీనివాసరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామికి పూజలు



చినదొడ్డిగల్లులో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పాయకరావుపేటలో సుబ్రహ్మణ్యస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నక్కపల్లి : సుబ్రహ్మణ్య షష్ఠి సోమవారం పలుచోట్ల అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. చినదొడ్డిగల్లు శ్రీరామ పంచాయతన ఆలయంలో ఆలయ ధర్మకర్త శ్రీపాద సత్యదేవశర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి పంచామృత అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. చిన దొడ్డిగల్లు, కొత్తూరు, వేంపాడు, కాగిత, నక్కపల్లి, తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉపమాకలో ఉన్న శ్రీ భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వరస్వామి ఆలయంలో కూడా సుబ్రహ్మణ్యస్వామి వారికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అర్చకులు శ్రీపాద ప్రణవ్‌రామ్, మహేష్ పాల్గొన్నారు.

పాయకరావుపేట : సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ఆలయాల్లో భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయాల్లో గల సుబ్రహ్మణ్య స్వామికి పూజలు నిర్వహించి, పాలాభిషేకాలు చేశారు. పాండురంగ దేవాలయంలో సుబ్రహ్మణ్యస్వామి, బృందావనం, రాజుగారిబీడు, నామవరం, పెద్దిపాలెం, సత్యవరం తదితర గ్రామాల్లో సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లాలం కోడూరులో ..

రాంబిల్లి: లాలంకోడూరులో సోమవారం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సుబ్రమణ్య షష్ఠి పర్వదినం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిపారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, వైస్ ఎంపీపీ కళరెడ్డి నర్సింగరావు పాల్గొన్నారు.